సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 18 । అక్టోబర్ । 2025



తవ్వేశారు.. పూడ్చేశారు

కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్లు బినామీ పేర్లతో రైతుల పొలాల్లో ఫారంపాండ్ పనులు చేపట్టి బిల్లులు చేసుకున్నాక పూడ్చేస్తున్నారు.

-10లో



ఎర్రచందనం కేసులో జైలుశిక్ష

ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి తీర్పుచెప్పారు.

-10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.270
రెండోరకం	రూ.150	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 148 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రామాలయంలో కంచి కామకోటి పీఠాధిపతి పూజలు



కంచికామకోటి పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని సూరపురాజుపల్లిలోని కోదండ రామాలయం మహా సంప్రోక్షణ కార్యక్రమంలో శుక్రవారం కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు కోదండరామస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు వీరికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

కాలువకు మరమ్మతులు



కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

బి.కొత్తకోట: మండలంలోని గుండ్లపల్లి వద్ద హంద్రీనీవా ప్రాజెక్టు పొంగునూరు ఉపకాలువకు బుధవారం గండిపడి తెగిపోయిన సంగతి తెలిసిందే. కాలువలో ఎగువనుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గింది. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల పూర్తిగా ఆపేశారు. దీంతో శుక్రవారం తెగిన కాలువకు మరమ్మతు పనులు చేపట్టారు. తెగిన కాలువను యథాస్థితికి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తిరుపతి చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్, మదనపల్లె ఎస్‌ఈ విఠల్ ప్రసాద్ కాలువ తెగిన చోటే ఉండి స్వయంగా పనులు పర్యవేక్షిస్తున్నారు. శనివారం పనులు పూర్తి చేయించి.. చెర్లోపల్లి నుంచి నీటిని విడుదల చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి



జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి: భద్రత, క్షేమం దృష్టిలో ఉంచుకొని రాబోయే దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. నిల్వలపై, ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలుపై పోలీసు అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జనవాసాలు, విద్యాసంస్థలు, వైద్యశాలలకు దూరంగా అధికారులు సూచించిన సురక్షిత ప్రదేశాల్లో బాణాసంచా విక్రయాలు జరగాలన్నారు. దుకాణాల మధ్య కనీసం దూరం పాటించాలని సూచించారు. విక్రయ కేంద్రాల వద్ద అగ్ని నిరోధక సిలిండర్లు, బక్కెట్లు, పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బాణాసంచా అక్రమ విక్రయాలు లేదా నిల్వలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 100 లేదా 112 నంబర్ల కాల్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

ఆరుతడి పంటలు సాగుచేయాలి



రైతులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సిద్దవటం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఆరుతడి పంటలను రైతులు సాగుచేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సిద్దవటం మండలం మాచుపల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ రీసోర్స్ పర్సన్ రామచంద్ర, రాజేశ్వరం నారాయణరెడ్డి పొలంలో ఆరుతడి పంటల సాగు విధానంలో వరిసాగు చేసిన విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నారాయణరెడ్డి పొలంలో 30 సెం.మీ. ప్లాస్టిక్ పైపు భూమిలో అమర్చి 15 సెం.మీ వరకు రంధ్రాలు ఉన్నాయన్నారు. వాటి ద్వారా నీళ్లు ఏ సమయంలో ఎంత వాడాలనే విధానాన్ని సులభతరంగా కనుక్కోవచ్చని అన్నారు. అనంతరం మండలంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వివిధ పంటలను.. ఏ గ్రేడ్ మోడల్‌లో వేసిన వాటిని పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ కన్సల్టెంట్ సాయికృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కలం.. నిరసన గళం



కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది.. నిజాలు రాసే కలంపై కక్ష కట్టింది.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే పత్రికా స్వేచ్ఛను హరించి వేస్తోంది.. ప్రజల పక్షాన నిలిచి, వాస్తవాలు ప్రచురిస్తున్న 'సాక్షి'ని వేధింపులకు గురి చేస్తోంది.. పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తోంది.. ఈ నేపథ్యంలో కలం నిరసన గళం విప్పింది.. 'సాక్షి'కి మద్దతుగా జర్నలిస్టులు కదంతొక్కారు.. 'సాక్షి'పై అక్రమ కేసులు, వేధింపులను పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.. ఇప్పటికైనా మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరించారు.

- పత్రికా స్వేచ్ఛపై దాడి తగదంటూ ఆందోళన
- 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యల పట్ల మండిపాటు
- అక్రమ కేసులు, వేధింపులపై ఆగ్రహం
- కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజం
- కదంతొక్కిన జర్నలిస్టులు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు

రాయచోటి: కూటమి ప్రభుత్వం, నెల్లూరు జిల్లా పోలీసులు ఐదు రోజులుగా సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న విధానాలను మీడియా, ప్రజా సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సాక్షిపై అక్రమ కేసులను బనాయించడం, విచారణ పేరుతో వేధింపులకు గురి చేయడంపై ఏపీయూడబ్ల్యూజే, ఏపీఈజేయూ, ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీజేఎఫ్, సోషియల్ వర్కర్స్, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదికల సంఘాల ప్రతినిధులు ప్రభుత్వం, పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. మీడియా సంస్థలు, ప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. . అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలిసి సాక్షి మీడియాపై బనాయించిన అక్రమ కేసులను వెనక్కి తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని అందజేశారు. మీడియా ప్రతినిధుల విన్నపాలను ప్రభుత్వానికి తెలియపరుస్తానని కలెక్టర్‌కు తెలియపరిచారు. అంతకు ముందు మీడియా ప్రతినిధులు డీఆర్‌ఓ సత్యనారాయణరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐజేయూసీ సభ్యుడు ఎం.ప్రభాకర్‌రెడ్డి, ఏపీయుడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రమేష్‌రాజు, ఈశ్వరయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాష్‌రాజు, వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు సర్ఫరాజ్, ఏపీజీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రషీద్, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవి శివయ్య, సోషియల్ వర్కర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, పత్రిక, మీడియా ప్రతినిధులు తాతయ్య, సాయికుమార్‌రెడ్డి, బసయ్య, కొండూరు వెంకట్రామరాజు, మునెయ్య, భువనేశ్వర్ రెడ్డి, రెడ్డయ్యయాదవ్, మురళి, జమాల్, శివ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీడియా, ప్రజా సంఘాల ప్రతినిధులు

జిల్లా వ్యాప్తంగా..

సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వ వేధింపులను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జర్నలిస్టులు ఆందోళనలు నిర్వహించారు. అనంతరం అక్కడి అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు ఎత్తివేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రాజంపేటలో..



రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

రాజంపేట: రాష్ట్రంలో ప్రతికా స్వేచ్ఛను కాపాడాలంటూ రాజంపేట జర్నలిస్టులు నిరసన గళం వినిపించారు. శుక్రవారం వీరు సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్నారు.సాక్షి కార్యాలయాలపై పోలీసులను పంపించి, వేధిస్తున్నారన్నారు. ఇలాంటి సంస్కృతిని విరమించుకోవాలని కోరుతూ సబ్‌కలెక్టరేట్‌లో పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మలిశెట్టి సుబ్బనరసింహులు, మోడపోతుల రామమోహన్, ప్రజాసంఘాల నేతలు చిట్వేలి రవికుమార్ (సీపీఎం) ,సికిందర్(సీపీఐ),జర్నలిస్టులు తేజం రవిచంద్రప్రసాద్, శ్రీధర్, ఐసీవీ వెంకటరెడ్డి, గాడి అశోక్‌కుమార్‌రెడ్డి, గుర్రంకొండ తివిక్రమ్, సురేష్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రెల్వేకోడూరు అర్బన్: ప్రభుత్వం చేసే తప్పిదాలను ప్రజలకు తెలియ చేస్తున్న సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వం అనవసర కేసులు పెడుతూ ఎడిటర్‌ను విచారణల పేరుతో వేధించడం ప్రత్రికాస్వేచ్ఛను కాలరాయడమేనని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఇలాంటి సంస్కృతిని విరమించుకోవాలని కోరుతూ స్థానిక తాహసీల్దార్ అమర్‌నాథ్‌కు వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో పాత్రికేయులు మల్లికార్జున శర్మ, మౌలా, విజయ్, శంకర్‌రెడ్డి, గంగాద్రి, స్థానికులు రత్తయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

మదనపల్లెలో..



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న మీడియా ప్రతినిధులు

మదనపల్లె: సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, జర్నలిస్టులపై గురిచేస్తున్న వేధింపుల తీరు చూస్తుంటే ప్రభుత్వంలో నెలకొన్న అసహనానికి పరాకాష్టగా నిలుస్తోందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండపల్లి అక్కులప్ప అన్నారు. ఈ వేధింపులపై శుక్రవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ నిర్మలాదేవికి వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసగౌడ, జిల్లా కార్యదర్శి వంశీధర్, ప్రెస్‌క్లబ్ కన్వీనర్ టి.షామీర్, ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షులు రమేష్, టి.బాలనాగు, ఖాజా, శ్రీనాథ్, విజయకుమార్, గుణ, మోహన తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



పత్రికా స్వేచ్ఛను కాలరాయాలని చూడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిది. పత్రికలో వచ్చిన కథనాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే న్యాయబద్ధంగా ఎదుర్కోవాలే తప్ప ఇలా వ్యవహరించడం సరికాదు. ప్రభుత్వ చర్యల్ని ఖండిస్తున్నాం. సాక్షి మీడియా ప్రతినిధులపై వేధింపులు ఆపాలి. –జీవీ ప్రసాద్, విద్యావేత్త, మదనపల్లి

మూల్యం చెల్లించుకుంటారు



పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. సాక్షి కార్యాలయంపై దాడులు, ఎడిటర్‌పై కేసులు అప్రజాస్వామికం. వీటికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.తక్షణమే సాక్షి మీడియా ప్రతినిధులపై వేధింపులు ఆపాలి. – ముద్దా బాబుల్ రెడ్డి, మండలాధ్యక్షుడు

పత్రికా స్వేచ్ఛను హరించడమే



సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కక్ష గట్టి పోలీసుల సాయంతో వరుసగా కేసులు నమోదు చేయడం ఆక్షేపణీయం.ప్రభుత్వ వైఫల్యాలపై సాక్షిలో కథనాలు ప్రచురించారని పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడమేమిటి?..ఇది అనాగరికం. ప్రభుత్వం ఇప్పటికైన తన తప్పును తెలుసుకుని వ్యవహరించాలి. – మూరి శంకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడు


అప్రజాస్వామికం



భారత రాజ్యాంగ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుంది. పత్రిక స్వేచ్ఛను అణిచివేసేందుకు సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టి ఒత్తిడికి గురి చేస్తోంది. ఇది అప్రజాస్వామికం. ప్రజాస్వామ్యవాదులంతా ఈ చర్యలను ఖండిస్తున్నారు. –వత్తలూరు సాయికిషోర్ రెడ్డి,వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఓబులవారిపల్లి

సోమశిలలో పుష్పరాజ్‌లు

- నందలూరులో ఎర్రచందనం స్మగ్లర్లు
- యథేచ్ఛగా దుంగల అక్రమరవాణా
- చిత్తూరులో పట్టుబడిన స్మగ్లర్..
- తీగ లాగితే కదిలిన డొంక
- పోలీసులు అదుపులో కొందరు, మరికొందరి కోసం గాలింపు





సోమశిల బ్యాక్‌వాటర్ వెంబడి ఎర్రచందనం చెట్లు ఉన్న ప్రాంతం



రాజంపేట: సోమశిల బ్యాక్‌వాటర్ ప్రాంతాలు పుష్పాలకు నిలయంగా మారాయి. తాజాగా పోలీసులు పట్టుకున్న స్మగ్లర్లు నందలూరు మండలానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ ఏడాది మే 12న ఎర్రచందనం స్మగ్లింగ్‌లో తగ్గేదేలా శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఇప్పుడు ఈ కథనం నిజమనడానికి పోలీసుల అదుపులో ఉన్న పుష్పరాజ్‌లే నిదర్శనమని సోమశిల ముంపువాసులు చెబుతున్నారు.

తీగలాగితే..

తీగలాగితే డొంక కదిలినట్లు చిత్తూరు జిల్లా పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన ఓ స్మగ్లర్ ఇచ్చిన సమాచారం మేరకు నందలూరులోని కొమ్మూరు, కోనాపురం, ఈదరపల్లె, నందలూరు , చాపలవారిపల్లె, చుక్కాయపల్లె, చింతకాయలపల్లె తదితర గ్రామాలకు చెందిన కొంత మంది ముఠాలుగా ఏర్పడి ఎర్రచందనం స్మగ్లింగ్ పాల్పడుతున్నారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇందులో టీడీపీకి చెందిన ఓ స్థానిక సంస్థ ప్రజాప్రతినిధితోపాటు ఆపార్టీ సానుభూతి పరులు ఉన్నారని తెలుస్తోంది. స్మగ్లర్ల ఫోన్‌ల ద్వారా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో విచారణ జరుగుతోంది. ఒక సామాజిక వర్గానికి చెందిన వారే స్మగ్లర్లుగా ఉన్నారనే సమాచారంతో, ఆ సామాజిక వర్గానికి చెందిన కొందరు పెదవి విరుస్తున్నారు.

- రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన ఓ స్మగ్లర్‌ను కూడా పోలీసులు పట్టుకున్నారు. అతనికి దాదాపు రూ.3కోట్ల పైగా ఆస్తి ఉంది. ఈ విధంగా నందలూరు మండలంలోని ముంపుగ్రామాలకు చెందిన వారు ఎర్రచందనంతో రూ. కోట్లు సంపాదించి, ఇతర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, ఇళ్లు, భూములును కొనుగోలు చేసి, స్థానికంగా మాసిపోయిన పంచలు, చొక్కాలతో కనిపిస్తున్నారు.

తిరుపతి, రేణిగుంటల్లో..

ఎర్రచందనం స్మగ్లింగ్‌తో ముంపుగ్రామాలకు చెందిన కొందరు తిరుపతి, రేణిగుంట తదితర ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసినట్లు, విలాసవంతమైన జీవితాలను గుడుపుతుండటం గమనార్హం. నందలూరులో ఎర్రచందన స్మగ్లర్ల తాకిడి అధికం కావడానికి సోమశిల బ్యాక్‌వాటర్ కారణంగా చెప్పవచ్చు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడే కీ పర్సన్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

గుట్టుచప్పుడుగా..బ్యాక్‌వాటర్‌లో..

సోమశిల బ్యాక్‌వాటర్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ గుట్టుచప్పుడుగా కొనసాగుతోంది. అటవీశాఖ డీఎఫ్‌ఓగా శ్రీనివాసులరెడ్డి ఉన్నపుడు బ్యాక్‌వాటర్‌లో దాచిపెట్టిన ఎర్రదుంగలడంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకట్టవేశారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడంలేదు. సోమశిల ముంపు గ్రామాలతోపాటు సమీప గ్రామాలకు చెందిన కొందరితో స్మగ్లింగ్ మళ్లీ యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే దిశగా అటవీశాఖ చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి.

జనసంచారంలేని ప్రాంతాలే టార్గెట్..

అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు నరికి వాటిని జనసంచారం లేని ముంపు గ్రామాల శివార్లకు చేర్చి, అక్కడి నుంచి అనుమానం రాకుండా అనుకున్న గమ్యాలకు తరలించేస్తున్నారు. గుట్టుచప్పుడుగా సాగుతున్న ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవహారం గురించి ముంపుగ్రామాల్లో ఏ ఒక్కరిని కదిలించినా చెబుతారు. పల్లాగట్టు, గుండ్లమడలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను నరికి వాటిని నాటుబోట్లలో గట్టుకు చేర్చి అక్రమంగా మెయిన్‌రోడ్డుకు ఎక్కిస్తున్నారు.

ఐలాండ్‌గా పల్లాగట్టు ..

పల్లాగట్టు ప్రాంతం 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. వెలుగులోకి రాని ఈ ఐలాండ్‌లో చట్టవ్యతిరేక కార్యకలపాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎర్రచందనం స్మగ్లర్లు పల్లాగట్టును తమకు అనుకూలంగా మార్చుకున్నారనే ఆరోపణలున్నాయి. గుండ్లమడతోపాటు సోమశిల వెనుకజలాల వెంబడి ఉన్న అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను నరికి అక్రమరవాణాకు బ్యాక్‌వాటర్‌ను అడ్డాగా వాడుకుంటున్నారు. రోడ్డు మార్గం లేకపోవడంతో బ్యాక్‌వాటర్ ద్వారానే బాలెలో తరలించి పొత్తపి ద్వారా ఓబలికి తరలిస్తున్నారు.

చేపలవేట ముసుగులో...

సోమశిల బ్యాక్‌వాటర్‌లో చేపల వేట ముసుగులో ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోంది. ముంపు గ్రామాలకు చెందిన ఇద్దరిని ఇటీవల ఇతర ప్రాంతంలో పట్టుకొని కేసు కూడా నమోదు చేసినట్లు తెలుస్తోంది. అటవీ చెక్‌పోస్టులు ఉన్నా.. నామమాత్రమే అన్న విమర్శలు వెలువడుతున్నాయి.

ఈజీమనీ కోసం..

ఈజీ మనీ కోసం కోనాపురం, కొమ్మూరు, చాపలవారిపల్లె, చుక్కాయపల్లె, ఈదరపల్లె, నందలూరు, చింతకాయపల్లె తదితర గ్రామాల యువకులు ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అలవాటుపడుతున్నారు. జనజీవనం లేని ముంపు గ్రామాల్లో అర్ధరాత్రి వేళలో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. నేరుగా బ్యాక్‌వాటర్ ఉన్న ప్రాంతాల వద్దకు చేరుకొని, అక్కడి నుంచి అక్రమరవాణా మొదలవుతుంది. అటవీశాఖ పట్టించుకోకపోవడం వల్లనే ఇటీవల ఎర్రచందనం స్మగ్లర్లు అధికమయ్యారు.

పరిశ్రమల ఏర్పాటుకు త్వరగా అనుమతులు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి: సింగిల్ డెస్క్ విధానంలో క్రింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్ట్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సింగిల్ డెస్క్ విధానం కింద గడిచిన త్రైమాసికంలో అందిన దరఖాస్తుల పరిష్కారం చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు అంశాలపై కలెక్టర్ సమీక్షించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె. కృష్ణ కిషోర్, డిఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు, రాయచోటి మున్సిపల్ కమీషనర్ రవి, జడ్పీఎం ఏపీఐఐసీ రమణమూర్తి, జిల్లా రవాణా శాఖ అధికారి, విద్యుత్ శాఖ అధికారి, డయా ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధి రాజశేఖర్, టెక్కి అసోసియేషన్ ప్రతినిధి రామమూర్తి నాయక్ పాల్గొన్నారు.

- సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమపై అన్నమయ్య షాపింగ్ పెస్టివల్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించారు. శుక్రవారం రాయచోటిలోని జూనియర్ కలాశాల గ్రౌండ్‌లో జేసీ ఆదర్శ రాజేంద్రన్, ఆర్డీఓ శ్రీనివాస్‌తో కలిసి షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఫుడ్ కోర్టులను సందర్శించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, వాణిజ్య పన్నుల శాఖ అధికారిణి సుమతి, టూరిజం శాఖ అధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



దహన సంస్కరణలు చేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లి సిటీ : మానవత్వం పరిమళించింది. పొట్టకూటి కోసం వచ్చిన బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కూలీలు పీటీఎం మండలం కందుకూరులో విద్యుత్తు షాక్‌తో మృతిచెందారు. మృతదేహాలను స్థానిక జిల్లా ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. కుటుంబీకులు, రక్తసంబంధీకులు ఎవరూ రాకపోవడంతో హెల్పింగ్ మైండ్స్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హిందూ సంప్రదాయబద్ధంగా ఇద్దరికీ స్థానిక శ్మశాన వాటిలో వారు దహన సంస్కరణలు చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు ఆనంద్, సమీర్, నవీన్, సుబ్బు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

వీరబల్లి: మండలంలోని వంగిమల్ల గ్రామమంలో పది కుటుంబాల టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెదివేటి వేరునాగయ్య, చెన్నయ్య, బాలయ్య, అలీ, బాబు, అశోక్ కుమార్ తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ టీడీపీలో ప్రజలకు ఏమి న్యాయం జరగలేదని, గత జగనన్న పరిపాలనలో జరిగిన సంక్షేమం, ఆర్థికాభివృద్ధి దృష్టిలో పెట్టుకుని పార్టీలో చేరామని తెలిపారు. అనంతరం విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిలను రాజంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌రెడ్డి, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డప్పరెడ్డి, తారకేశ్వర్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళపై దాడి

మైదుకూరు : పట్టణంలోని అరుంధతీ నగర్‌కు చెందిన మహిళ గద్దె సుజాతపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై పోలీసుల కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 11న సుజాత భర్త రవికి, బొచ్చెనపల్లె పాలకొండయ్య, రాజేష్, పెద్ద ఓబులేసుకు మధ్య వాగ్వాదం జరిగింది. అది మనసులో పెట్టుకొని ఈ నెల 14న సుజాతపై ముగ్గురు దాడి చేసి గాయపరిచి అవమానపరిచారు. చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆస్పత్రిలో చేరిన బాధితురాలు అక్కడ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పాలకొండయ్య, రాజేష్, పెద్ద ఓబులేసుపై ఎస్‌ఐ సుబ్బారావు కేసు నమోదు చేశారు.

ఝరికోనలో మృతదేహం

కలకడ : మండలంలోని ఝరికోనలో గుర్తుతెలియని మృత దేహం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రామాంజ నేయులు శుక్రవారం పరిశీలించారు. సుమారు 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి రెండు రోజుల కిందట నీటిలో పడి ఉండవచ్చునని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలన్నారు

తవ్వేశారు.. బిల్లు చేసుకుని పూడ్చేశారు



వల్లీసాబ్ పొలంలో చేపట్టిన ఫారంపాండ్ (ఫైల్)



జేసీబీతో పూడ్చేసిన ఫారంపాండ్

- ఫారంపాండ్ పేరుతో తెలుగు తమ్ముళ్ల అక్రమార్జన
- వాటర్‌షెడ్‌లో రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం

పెద్దతిప్పసముద్రం : కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్లు అధికారులను కను సైగలతో శాసిస్తూ లక్షల రూపాయల ప్రజా ధనం దోచేస్తున్నారు. సొంత భూములు కలిగిన రైతులకు సమాచారం ఇవ్వకుండా బినామీ పేర్లతో రైతుల పొలాల్లో ఫారంపాండ్ పనులు చేపట్టి బిల్లులు చేసుకున్నాక గుట్టు చప్పుడు కాకుండా పూడ్చేస్తున్నారు.

మండలంలోని సంపతికోట పంచాయతీ కొత్తపల్లికి చెందిన పి.రామలక్ష్మమ్మ పేరిట ఎలాంటి వ్యవసాయ భూములు లేవని సమాచారం. అయితే అదే పంచాయతికి చెందిన వల్లీసాబ్‌కు బోడిగుట్ట సమీపంలో ఖాతా నంబర్ 820లో అసైన్‌మెంట్ భూమి ఉంది. ఆయన కుటుంబీకులు బెంగళూరులో ఉంటూ నెలకోసారి స్వగ్రామానికి వచ్చి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు వల్లీసాబ్ పొలంలో వాటర్‌షెడ్ ద్వారా మూడు నెలల కిందట ఫారంపాండ్ నిర్మించి బిల్లులు చేసుకోవాలని తలపెట్టారు. అనుకున్న వెంటనే పని గుర్తింపు సంఖ్య 20083లో రూ.1.85 లక్షల అంచనాతో పనులు పూర్తి చేశారు. భూమే లేని పి.రామలక్ష్మమ్మ పేరిట వల్లీసాబ్ పొలంలో చేసిన పనులకు బిల్లులు చేసుకున్నారు. వారం రోజుల కిందట వల్లీసాబ్ వచ్చి తన పొలం వద్ద ఫారంపాండ్ పనులు చూసి అవాక్కయ్యాడు. తనకు కనీస సమాచారం ఇవ్వకుండా పనులెలా చేపట్టారని కూటమి నాయకులను గట్టిగా నిలదీశాడు. ఇక చేసేది లేక తెలుగు తమ్ముళ్లు మూడు రోజుల కిందట జేసీబీ యంత్రాన్ని రప్పించి ఫారంఫాడ్‌ను గుట్టుగా పూడ్చేశారు. లక్షల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయి.



రామలక్ష్మమ్మ పేరిట అధికారులు ఏర్పాటు చేసిన శిలాఫలకం (ఫైల్)

నిధులను రికవరీ చేయాలి



వాటర్‌షెడ్ ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేయాలి. ఫారంపాండ్ పనికి మంజూరు చేసిన ప్రజాధనాన్ని అధికారులు రికవరీ చేయాలి. కమిటీల ఆమోదం లేకుండా అధికారులను బెదిరించి బిల్లులు చేసుకోవడం పద్ధతి కాదు. సెంటు భూమి కూడా లేని బినామీల పేరిట బిల్లులు చేసుకోవడం సబబుకాదు. రైతులు, కమిటీలు, అధికారుల ఆమోదంతో ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలి.

-రఘునాథ్‌రెడ్డి, వాటర్‌షెడ్ ఛైర్మన్, సంపతికోట

ఎర్రచందనం కేసులో ఇద్దరికి జైలుశిక్ష



నిందితులతో పోలీసులు

ములకలచెరువు/తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష, మూడు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పుచెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ఆర్.గణేష్ తెలిపిన వివరాల మేరకు.. 2019 డిసెంబర్, 5న ములకలచెరువు పోలీసులకు వచ్చిన సమాచారంతో మదనపల్లె–కదిరి రోడ్డు తంబేపల్లి క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. మదనపల్లె నుంచి ఓ టాటా సుమో వాహనం అతివేగంగా వస్తూ పోలీసులలను చూసి ఆగింది. ఆ వాహనంలోని ఇద్దరు కర్ణాటక, కోలార్ జిల్లా బంగారుపేట తాలూకా, దొడ్డూరుకు చెందిన నారాయణప్ప శివకుమార్, బంగారు పేట తాలూకా కురబర హళ్లికి చెందిన సుబ్రహ్మణ్యం, మంజునాథ్ పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. టాటా సుమో వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో ఉన్న 162 కిలోల ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

శాస్త్రీయతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీవైఈవో, అధికారులు

రాయచోటి టౌన్ : శాస్త్రీయ దృక్పథంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సు ఉపయోగపడుతుందని డీవైఈవో నాగయ్య పేర్కొన్నారు. పట్టణంలోని రాయచోటి డైట్ కళాశాలలో జిల్లా సైన్స్ అధికారి మార్లఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను డీవైఈఓ అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్వాంటం యుగం ప్రారంభం.. బలాలు, బలహీనతలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సెమినార్‌లో ప్రెజెంటేషన్, వైవా, అప్టిట్యూడ్ టెస్టుల ద్వారా పరీక్షించి ప్రతిభ కనబరిచిన సంబేపల్లె మోడల్ స్కూల్ విద్యార్థి బొజ్జ విశ్వానందరెడ్డి, వాల్మీకిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన షామీన్ తాజ్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. శనివారం విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, రెడ్డెయ్య, శ్రీనివాసరాజు, మడితాటి నరసింహారెడ్డి, దిలీప్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, శివలక్ష్మి, రంజిత, హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఆపలేదని మహిళల ఆగ్రహం

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని కొత్త బోయనపల్లె (రాజంపేట మండలం) సమీపంలో ఆర్టీసీ బస్సు ఆపకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజంపేట–కడప మధ్య నడిచే పల్లె వెలుగు బస్సును డ్రైవర్ న్యూబోయనపల్లె వద్ద ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో కొందరు యువకులు బస్సును వెంబడించి డ్రైవర్, కండెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. మహిళా ప్రయాణికులు డ్రైవర్ తీరుపై విరుచుకుపడ్డారు. ఉచిత బస్సు ఓవర్ లోడ్‌తో ఉన్నా ఆపాల్సిందేనని ప్రయాణికులు పట్టుబడుతుండడంతో డ్రైవర్, కండెక్టర్లు నిస్సహాయ స్థితిలో చేతులెత్తేస్తున్నారు.

రెండు లారీలు ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన లారీలు

ములకలచెరువు : రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మండలంలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై ములకలచెరువు నుంచి మదనపల్లె వైపుకు ఐరన్ లోడుతో వెళ్తున్న లారీ, మదనపల్లె నుంచి ములకలచెరువుకు ఖాళీ క్రేట్లతో వెళ్తున్న లారీలు ఢీన్నాయి. ఈ ప్రమాదంలో పి.మురళీకృష్ణ (40), రామూర్తి (38)లకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచుకు గాయాలు



మల్లయ్యను పరామర్శిస్తున్న రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : బొలెరో వాహనం ఢీకొని బక్కన్నగారిపల్లె సర్పంచ్ మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువుల వివరాల మేరకు.. సర్పంచ్ మల్లయ్య పులివెందులలో నుండి తన సొంత పనులను ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్నారు. వేంపల్లె నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో మల్లయ్యకు చేయి విరి గి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడపకు తీసుకెళ్లారు. మల్లయ్యను వేంపల్లి జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యుత్ కార్మికులు, నాయకులు

రాయచోటి అర్బన్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాయచోటిలో విద్యుత్తు కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు వారికి మద్ధతునిచ్చి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో జరిగే చర్చలు కార్మికులు, ఉద్యోగులకు అనుకూలంగా లేకపోతే నిరసనను సమ్మె దిశగా తీసుకెళ్లి మద్దతు ప్రకటించామన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో విధులకు కొత్త కార్మికులు వస్తే వారిని అడ్డుకుంటామని తెలిపారు. యూఈసీడబ్ల్యూయూ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, జేఎల్‌ఎంలకు సర్వీస్ రెగ్యులేషన్స్ వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదని, మంజూరులో కాలయాపన చేయడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సభ్యులు రామనుజన్‌రెడ్డి, ఈశ్వరయ్య, గజేంద్ర వర్మ, శివయ్య, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, రవీంద్రారెడ్డి, జోష్ణ శృతి, రాధిక, అర్చన, సింధు, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరు మృతి



పఠాన్‌మున్నా(ఫైల్)



చెరువు వద్ద గుమికూడిన స్థానికులు, పోలీసులు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ మండలం శిబ్యాల పరిధిలోని కానుగ చెరువులో పడి పఠాన్‌మున్నా (40) శుక్రవారం మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. శిబ్యాల గ్రామం (చెరువుకు దగ్గరగా ఉన్న ఊరు)లోని తన ఇంటి నుంచి గేదెలను మేపేందుకు పఠామున్నా వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ సాగించారు. పశువులు మేపేందుకు వెళ్లిన ఆధారాలు ఉండటం, తరువాత ఇంటికి రాకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగి ఉంటుందని భావించి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి సాయంతో చెరువులో గాలించి మృతదేహాన్ని గుర్తించారు. గేదెలు మేస్తూ చెరువులోకి వెళ్లినట్లు ఆధారాలు లభించాయి. మున్నా కూడా నీటి మడుగులో నుంచి గేదెలను బయటకు తోలేందుకు వెళ్లి అక్కడ లోతైన గుంటలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కార్మికులను విస్మరిస్తే సహించం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్



ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్తు సిబ్బంది

రాజంపేట రూరల్ : జిల్లాలో పని చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను విస్మరిస్తే సహించబోమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్, జిల్లా సహాయకార్యదర్శి చిట్వేలి రవికుమార్ హెచ్చరించారు. స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట రాజంపేట విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి.. రెగ్యులర్ చేయాలన్నారు. వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేయాలని, గ్రేడ్ 2 కార్మికులకు న్యాయం చేసే వరకూ పాత పెన్షన్ పద్ధతి పునరుద్ధరించాలన్నారు. నగదు రహిత అపరిమిత మెడికల్ పాలసీని, గ్రేడ్–2 జేఎల్‌ఎంలకు ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్ వర్తింపజేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, దళారీ వ్యవస్థ లేకుండా కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుఈఈయూ జిల్లా కార్యదర్శి ఈ.శ్రీహరి, కిరణ్‌కుమార్, పి.బాలకృష్ణ, డి.సుధాకర్, సురేంద్ర, ఎరికలరెడ్డి, నాగబాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఈవో నూతన కార్యవర్గం



జి.జయరామయ్య



వి.రమణనాయక్



ఎస్.ముజీబ్‌బాషా

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా ఎంపీహెచ్ఈవో(మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ అసోషియేషన్) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాయచోటి ఎన్జీవో హోంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.శివయ్య, ఎన్నికల అధికారి ఎం.నరసింహులు, టి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా జి.జయరామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.రమణ నాయక్, జిల్లా కోశాధికారిగా ఎస్.ముజీబ్‌బాషా, ఉపాధ్యక్షులుగా కె.లక్ష్మీనారాయణ, బి.రామచంద్ర, జిల్లా జాయింట్ సెక్రటరీగా బీవీ.రమణయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1100 మంది గెజిటెడ్, నాన్ గెజిటెడ్ హోదాలో ఉన్న వారు సంఘంలో ఉన్నారని చెప్పారు. అసోసియేషన్ క్యాడర్‌కు గెజిట్ కల్పించాలని, సీహెచ్‌సీ బేసిక్‌తో సమానంగా ఎంపీహెచ్ఈవో బేసిక్ ఉండాలని డిమాండ్ చేశారు. ఎంపీహెచ్ఈవో క్యాడర్‌ను మండల హెల్త్ ఆఫీసర్‌గా మార్చాలని, అబాలిష్ అయిన ఎంపీహెచ్ఈవో పోస్టులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల వ్యవహరించారు.

ఆర్‌డీఎస్‌ఎస్‌తో 24 గంటల విద్యుత్ సరఫరా

ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్



పనులను పరిశీలిస్తున్న సీఎండీ లోతేటి శివశంకర్

మైదుకూరు : గ్రామీణ ప్రాంతాలకు ఆర్డీఎస్ఎస్ (రివేంపుడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం)తో 24 గంటల విద్యుత్ సరఫరా చేయవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ అన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని రాయప్పగారిపల్లె వద్ద జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రాయప్పగారిపల్లెలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను పరిశీలించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ అనుకూల, గ్రామీణాభివృద్ధి కేంద్రీకృత దృక్పథాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలను ఏపీఎస్పీడీసీఎల్ విజయవంతంగా కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

దువ్వూరు : పీఎం–కుసుం ఫీడర్ సోలార్ విద్యుద్దీకరణ పనులనుఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. దువ్వూరు జగనన్న కాలనీ వద్ద ఐదు మెగావాట్ల సామర్థ్యంతో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. విద్యుదుత్పత్తికి అవసరమైన స్థల సేకరణ, మట్టి పరీక్ష అంశాలపై అధికారులతో సమీక్షించారు. రైతులకు నాణ్యమైన, నిరంతర ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణ, ఈఈలు లక్ష్మీపతి, నాగరాజు, డీఈఈలు శ్రీకాంత్, శివభాస్కర్, ఏఈలు రాజ్‌కుమార్, రామభద్రయ్య, హరి పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్, ల్యాబ్ సీజ్



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మైదుకూరు : ఛాతీనొప్పితో వచ్చిన మహిళకు చేసిన వైద్యం వికటించి మృతి చెందడానికి కారణమైన ఆర్‌ఎంపీ క్లినిక్, ల్యాబ్‌ను వైద్య శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డుకు చెందిన ఓ మహిళ గురువారం మధ్యాహ్నం ఛాతీ నొప్పితో బాధపడుతూ అదే రోడ్డులోని మెడికల్ షాప్ నిర్వాహకుడు వద్దకు వెళ్లారు. ఆయన చేసిన వైద్యం వికటించడంతో మహిళ మృతిచెందిన విషయంపై సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్, జిల్లా డెమో ఆఫీసర్ భారతి, వైద్యాధికారులు ఎంపీఆర్ మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. షాప్ నిర్వాహకుడు అనుమతులు లేకుండా ఆర్‌ఎంపీగా క్లినిక్, ల్యాబ్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్ఓ నాగరాజు ఆదేశాలతో మెడికల్ షాప్, క్లినిక్‌ను సీజ్ చేసి డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశామని డెమో అధికారి భారతి తెలిపారు. ఈ తనిఖీల్లో మెడికల్ ఆఫీసర్ ఎస్.అయేషా, డిస్ట్రిక్ట్ లీగల్ కన్సల్టెంట్ ఎం.పాలేశ్వరరావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు ఎం.మరియాకుమారి, ఆర్.వెంగళరెడ్డి, టి.జయప్రకాష్, కె.వీరాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఎం యశోద పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



మృతిచెందిన రాంబాబు

జమ్మలమడుగు రూరల్: మండలానికి చెందిన వల్లెపు రాంబాబు (40) శుక్రవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని భీమరాయుని కొట్టాల గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి వెళ్లాడు. తిరిగి వచ్చి ఫోన్ తీసే క్రమంలో ప్లగ్ ఊడి వచ్చింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు భార్య వల్లెపు రూపావతి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

తీగలు తగిలి గేదెలు..

వల్లూరు : మండలంలోని భాకరాపురం గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపారు. గురువారం రాత్రి కురిసిన గాలి వానకు భాకరాపురం సమీపంలోని పొలాల్లో విద్యుత్ లైన్లు తెగి నేలమీద పడ్డాయి. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో గ్రామానికి చెందిన టి.నాగేశ్వర్‌రెడ్డి తన గేదెలను మేపడానికి పొలానికి తీసుకువెళ్లాడు. పొలంలో తెగి పడిన తీగలు రెండు గేదెలకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మిగిలిన గేదెలను పక్కకు తోలడంతో అవి సురక్షితంగా బయటపడ్డాయి. సుమారు లక్షన్నర రూపాయల విలువ చేస్తుందన్నారు. పరిహారం ఇచ్చిఆదుకోవాలని రైతు కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలింపు



హిటాచీ ద్వారా ఇసుకను టిప్పర్లకు నింపుతూ..

- ప్రతి రోజు వంద టన్నులకుపైగా ఇసుక తరలింపు
- మండల స్థాయి టీడీపీ నాయకుడి అండతో రవాణా

సాక్షి టాస్క్‌ఫోర్స్ : మండలస్థాయి టీడీపీ నేత అండతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. చక్రాయపేట మండలం మారెళ్ల మడక సమీపంలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు రీచ్‌లో భారీగా వర్షపునీరు చేరింది. ఈ పరిణామం చక్రాయపేట మండల టీడీపీ నాయకుడికి వరంగా మారింది. అద్దాలమర్రి చెక్ పోస్టు సమీపంలో అమ్మవారి గుడి వద్ద పెద్ద ఎత్తున ఇసుక అందుబాటులో ఉండడం గమనించి దానిపై ఆ నాయకుడు కన్నేశారు. అనుకున్నదే తడవుగా ఆ ప్రాంతంలో హిటాచీ ఏర్పాటుచేసి నిత్యం వంద టన్నులకు పైగా ఇసుక తరలించేస్తున్నారు. నిత్యం ఇది కనిపిస్తున్నా.. ఇటు పోలీసులు, అటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. టన్నుల వారీగా వచ్చే ఆదాయంలో వాటాల రూపంలో అందరికీ చేరుతోందనే ఆరోపణలున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మవారి ఆలయం నిర్మించి అక్కడి వరకూ సీసీ రహదారి నిర్మించింది. ఈ ఆలయ సమీపంలోనే తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.